సాక్షి విశాఖపట్నం

మంగళవారం। 16। మే। 2023



అన్నవరం.. అద్భుతం

సరికొత్త టూరిజం డెస్టినీగా జిల్లాకు సరిహద్దు గ్రామంగా ఉన్న అన్నవరం ప్రాంతం అవతరిస్తోంది. 8లో



పకడ్బందీగా పాలిటెక్నిక్ పరీక్షలు

పాలిటెక్నిక్ వార్షిక పరీక్షలు పకడ్బందీగా జరుగుతున్నాయని రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ సంయుక్త కార్యదర్శి తెలిపారు. 8లో



లక్ష్యం.. నూరుశాతం

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించేలా అధికారులు లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. 10లో

న్యూస్‌రీల్

పాండ్రంగి వంతెనకు అదనంగా రూ 2.50 కోట్లు మంజూరు

పద్మనాభం: మండలంలోని పాండ్రంగి సమీపం లో గోస్తని నదిలో హైలెవెల్ వంతెన నిర్మాణానికి అదనంగా రూ.2.50 కోట్లు మంజూరయ్యాయి. ఈ మేరకు పంచాయతీరాజ్ అండ్ రూరల్ డవలప్‌మెంట్ చీఫ్ ఇంజనీర్ జీవో విడుదల చేశారు. గతంలో మంత్రిగా ఉన్నప్పుడు ముత్తంశెట్టి శ్రీనివాసరావు వంతెన విషయం సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా రూ.14 కోట్లు మంజూరు చేశారు. అయితే పెరిగిన రేట్ల దృష్ట్యా వంతెన నిర్మాణానికి నిధులు పెంచాలని ఆయన మళ్లీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి ఇటీవల తీసుకువెళ్లగా అదనంగా రూ.2.50 కోట్లు మంజూరు చేశారు. మొత్తంగా వంతెన నిర్మాణానికి రూ.16.50 కోట్లు మంజూరయ్యాయి. వంతెన కోసం అదనంగా నిధులు మంజూరు చేసిన సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు. నూతనంగా టెండర్లు వేసి వంతెన నిర్మాణ పనులు త్వరలో ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

రామిరెడ్డి బాధ్యతల స్వీకరణ



ఏయూక్యాంపస్: ప్రభుత్వ మానసిక ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ కె.వి.రామిరెడ్డి సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం సైకియాట్రి విభాగాధిపతిగా సేవలు అందిస్తున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.వి.రామిరెడ్డిని ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది అభినందించారు.

కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి రాక నేడు

మహారాణిపేట: కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి డాక్టర్ భగవత్ కారద్ మంగళవారం విశాఖ వస్తున్నారు. హైదరాబాద్ నుంచి విమానంలో ఉదయం 7 గంటలకు విశాఖ చేరుకొని నేరుగా సర్క్యూట్ హౌస్‌కు వెళ్తారు. 10 గంటలకు పోర్టు కళావాణి స్టేడియంలో జరిగే రోజ్‌గార్ మేళాలో మంత్రి పాల్గొంటారు. ఉదయం 11.30 గంటలకు హోటల్ దసపల్లాలో జరిగే స్టేట్ లెవెల్ బ్యాంకర్ల సమావేశానికి హాజరవుతారు. సాయంత్రం 4.35 గంటలకు విమానంలో విజయవాడ వెళ్తారు.

నేడు మంత్రి కాకాణి రాక

మహారాణిపేట: రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి మంగళవారం విశాఖ వస్తున్నారు. ఉదయం 10.05 గంటలకు తిరుపతి నుంచి విమానంలో విశాఖ చేరుకుంటారు. అక్కడ నుంచి ప్రభుత్వ సర్క్యూట్ హౌస్‌కు చేరుకొని కొద్ది సేపు బస చేస్తారు. ఉదయం 11.30 గంటలకు హోటల్ దస్పల్లాలో 223వ స్టేట్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ సమావేశంలో పాల్గొంటారు.

నేడు ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ ముట్టడి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ అడ్మిన్ బిల్డింగ్ ముట్టడి మంగళవారం నిర్వహించనున్నారు. నూతన వేతనాలు అమలు డిమాండ్‌పై ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఉదయం 8 నుంచి అడ్మిన్ బిల్డింగ్ ముట్టడించనున్నారు. కార్యక్రమంలో కార్మికులందరూ పాల్గొనాలని అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు కోరారు.

నేడు జాబ్ మేళా

మురళీనగర్(విశాఖ ఉత్తర): ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కంచరపాలెం ఓల్డ్ ఐటీఐలో మంగళవారం జాబ్ మేళా నిర్వహిస్తామని సంస్థ జిల్లా అధికారి సాయికృష్ణ చైతన్య, ఐటీఐ కాలేజీ ప్రిన్సిపాల్ డా. శ్రీకాంత్ తెలిపారు. ఐటీ కంపెనీలైన డబ్ల్యూఎన్‌ఎస్, ఫిన్‌సోల్‌తో పాటు యాక్ట్ ఫైబర్ నెట్ కంపెనీలో 150 పోస్టుల భర్తీకి ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, బీటెక్, ఐటీఐ, పూర్తి చేసిన ఉత్తరాంధ్రలోని యువత దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎంపికైన అభ్యర్థులకు అర్హతల ఆధారంగా నెలకు రూ.10,000 నుంచి రూ.20,000 వరకు జీత భత్యాలు ఉంటాయని, దువ్వాడ సెజ్‌లో పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. వయో పరిమితి 18 నుంచి 35 ఏళ్లుగా నిర్ణయించినట్లు చెప్పారు. మరిన్ని వివరాలకు 92925 53352లో సంప్రదించవచ్చు.

రేపు ఉపాధి కార్యాలయంలో..

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరియర్ సర్వీస్ సెంటర్‌లో బుధవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా సబ్ రీజినల్ ఎంప్లాయ్‌మెంట్ అధికారి నిట్టాల శ్యామ్ సుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖ ఏప్‌టెక్స్ కన్సలెంట్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో 20 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. సేల్స్ ఎగ్జిక్యూటివ్, టెలికాలర్ ఉద్యోగాలకు ఏదైనా డిగ్రీ, బీఎస్సీ కెమిస్ట్రీ పూర్తి చేసిన 21–30 సంవత్సరాల వయసు గల పురుష, మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. ఆయా ఉద్యోగాన్ని బట్టి జీతం నెలకు రూ.13,000 నుంచి రూ.15,000లు ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ncs.gov.in వెబ్‌సైట్‌లో పేర్లు రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.

ఆర్టీసీలో బ్రేక్ జర్నీ!

- దూరప్రాంతాలకు వెళ్లే వారికి సౌలభ్యం
- ఒకే టికెట్టుతో ప్రయాణం
- 2 నుంచి 22 గంటల వరకు లే అవర్ చాన్స్
- అందుబాటులోకి మల్టీ సిటీ టికెటింగ్
- ఉత్తరాంధ్ర నుంచి పలు నగరాలకు కనెక్టివిటీ సదుపాయం



సాక్షి, విశాఖపట్నం: ఇన్నాళ్లూ విమాన ప్రయాణికులకు మాత్రమే పరిమితమైన బ్రేక్ జర్నీ సదుపాయం ఇప్పుడు ఆర్టీసీ బస్సు ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం దూర ప్రాంతాలకు వెళ్లే వారు బస్సు మారిన ప్రతిసారీ టిక్కెట్టు తీసుకోవలసి వస్తోంది. ఇకపై అలాంటి అవసరం లేకుండా మల్టీ సిటీ టికెటింగ్ సౌలభ్యాన్ని ఆర్టీసీ కల్పించింది. ఏదైనా పట్టణం నుంచి దూరప్రాంతంలో ఉన్న మరో పట్టణానికో లేదా నగరానికో వెళ్లడానికి నేరుగా బస్సు సదుపాయం ఉండడం లేదు. ఇలాంటి వారు తామెళ్లబోయే ప్రాంతానికి ఎక్కడ నుంచి బస్సు సౌకర్యం ఉందో అక్కడకు చేరుకోవలసి వస్తోంది. ఇకపై తాము బయలుదేరే చోట నుంచే గమ్యస్థానానికి ఆన్‌లైన్ ద్వారా ఒకేసారి నేరుగా టిక్కెట్టు పొందవచ్చు. ఉదాహరణకు పార్వతీపురం నుంచి హైదరాబాద్ వెళ్లాలంటే డైరెక్ట్ ఆర్టీసీ బస్సు సర్వీసు లేదు. ఈ ప్రయాణికులు విశాఖకు ఓ బస్సులో వచ్చి హైదరాబాద్ బస్సుకు మరోసారి టిక్కెట్టు తీసుకోవలసి వస్తోంది. ఇది వ్యయ ప్రయాసలతో కూడుకుంటోంది. అంతేకాదు.. వీరు ఎక్కిన ప్రతి బస్సులోనూ రిజర్వేషన్ కోసం కూడా ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఈ మల్టీ సిటీ టికెటింగ్ విధానంలో తామెళ్లే బస్సుల్లో ఒకే రిజర్వేషన్ చార్జీతో ప్రయాణించే వీలుంటుంది. మారే బస్సులోనూ ముందుగానే సీటు రిజర్వ్ అయి ఉంటుంది. ఆర్టీసీ కొత్తగా ప్రవేశపెట్టిన ఈ విధానంలో ప్రయాణికుడు తన గమ్యస్థానానికి వెళ్లడానికి బ్రేక్ జర్నీ సదుపాయం ఉంది. తానెళ్లే బస్సు కోసం కనీసం 2 నుంచి గరిష్ఠంగా 22 గంటల వరకు వేచి ఉన్నా బ్రేక్ జర్నీలో ఆ టిక్కెట్టు చెల్లుబాటు అవుతుంది. ఒకవేళ తొలి బస్సులో వెళ్లే వారి బస్సు మార్గంమధ్యలో ఆగిపోతే వెంటనే ఆ ప్రయాణికుడిని మరో బస్సులో పంపించి ప్రయాణానికి ఆటంకం లేకుండా చూస్తారు.

ఉత్తరాంధ్ర నుంచి ఇలా..

ఉత్తరాంధ్ర జిల్లాల్లో విశాఖపట్నం మినహా ఇతర చోట్ల నుంచి దూర ప్రాంతాలకు నేరుగా ఆర్టీసీ బస్సు సదుపాయం లేదు. దీనిని దృష్టిలో ఉంచుకుని విశాఖ సహా శ్రీకాకుళం, పార్వతీపురం, విజయనగరం, పాడేరు తదితర ప్రాంతాల నుంచి బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, తిరుపతి, ఒంగోలు, శ్రీశైలం, విజయవాడలకు మల్టీ సిటీ టికెటింగ్ (బ్రేక్ జర్నీ) సదుపాయాన్ని కల్పించారు.

ఉత్తరాంధ్ర నుంచి మల్టీ సిటీ టికెటింగ్ సదుపాయం ఇలా..

బయలుదేరడం	వయా/బ్రేక్ జర్నీ	గమ్యం
శ్రీకాకుళం	విశాఖపట్నం	హైదరాబాద్
శ్రీకాకుళం	విశాఖపట్నం	శ్రీశైలం
శ్రీకాకుళం	విశాఖపట్నం	ఒంగోలు
విశాఖపట్నం	రాజమండ్రి	బెంగళూరు
విశాఖపట్నం	కాకినాడ	చెన్నై
పార్వతీపురం	విశాఖపట్నం	హైదరాబాద్
పార్వతీపురం	రాజమండ్రి	బెంగళూరు
విజయనగరం	విశాఖపట్నం	హైదరాబాద్
కొత్త ప్రతిపాదనలు ఇలా..		
పాడేరు	రాజమండ్రి	తిరుపతి
పాడేరు	తుని	విజయవాడ
పార్వతీపురం	విశాఖపట్నం	శ్రీశైలం
విజయనగరం	విశాఖపట్నం	శ్రీశైలం
శ్రీకాకుళం	విశాఖపట్నం	శ్రీశైలం

విస్తృత ప్రచారం చేస్తాం..



ఆర్టీసీ యాజమాన్యం అందుబాటులోకి తెచ్చిన మల్టీ సిటీ టికెటింగ్ సదుపాయం పై ప్రయాణికుల్లో అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. దీనిపై కరపత్రాలు ముద్రించి పంచుతాం. టిక్కెట్టు కౌంటర్లలోనూ తెలియజేస్తాం. అక్కడ పోస్టర్లను కూడా అతికిస్తాం. కొత్త విధానంలో ప్రయాణికులు బ్రేక్ జర్నీకి వీలుంటుంది. బస్సు మారిన ప్రతిసారీ రిజర్వేషన్ చార్జీ చెల్లించే అవసరం ఉండదు. బస్సు మారే చోట్ల మళ్లీ టిక్కెట్టు కోసం వేచి ఉంటూ సమయం వృథా కాదు. ఈ సదుపాయాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలి.

– సి.రవికుమార్, జోన్–1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్

12,173 మందికి మత్స్యకార భరోసా

- నేడు బ్యాంకు ఖాతాల్లో నగదు జమ
- ఈ ఏడాది పెరిగిన 839 మంది లబ్ధిదారులు



భీమిలిలో వలలు అల్లుకుంటున్న మత్స్యకారులు

మహారాణిపేట : వేట నిషేధ సమయంలో మత్స్యకార కుటుంబాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆదుకుంటోంది. మత్స్య సంపద సంరక్షణ పునరుత్పత్తి కోసం ప్రతి ఏడాది 61 రోజులు వేట నిలుపుదల చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ సమయంలో మత్స్యకారులను ఆర్థికంగా ఆదుకోవడానికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకాన్ని ప్రవేశ పెట్టారు. అధికారం చేపట్టిన నాటి నుంచి ఈ పథకం అమలు చేస్తున్నారు. అర్హులైన మత్స్యకారులకు జీవన భృతి కోసం మత్స్యకారులకు రూ.పది వేలు చొప్పున 2019లో 18,925 మంది, 2020లో 20,273 మంది, 2021లో 11,193 మంది, 2022లో 11,389 మందికి నగదు జమ చేశారు. 2023కు సంబంధించి మంగళవారం ఉదయం 11 గంటలకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి మత్స్యకారుల బ్యాంకు ఖాతాల్లో ఒక్కొక్కరికి రూ.10 వేలు జమ చేయనున్నారు. ఈ ఏడాది 12,173 మందికి లబ్ధి చేకూరనుంది. గత ఏడాదితో పోలిస్తే ఈసారి 839 మంది లబ్ధిదారులు పెరిగారని మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు జి.విజయ పేర్కొన్నారు. ఇప్పటికే అర్హుల జాబితాను గ్రామ, వార్డు సచివాలయాల్లో అందుబాటులో ఉంచామన్నారు.

ప్రశాంతంగా ఈఏపీసెట్





చినముషిడివాడలో పరీక్షా కేంద్రం వద్ద క్యూలో విద్యార్థులు

విశాఖ విద్య: ఏపీ ఈఏపీసెట్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం, సాయంత్రం సెషన్స్‌లో ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఈ పరీక్షకు జిల్లాలో 12 కేంద్రాలను ఏర్పాటు చేశారు. నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించబోమని అధికారులు ముందుగానే ప్రకటించటంతో విద్యార్థులు కేటాయించిన కేంద్రాలకు ముందుగానే చేరుకున్నారు. ఇంజనీరింగ్ ఎంట్రన్స్ కోసం జిల్లాలో 28,663 మంది విద్యార్థులు నమోదు చేసుకున్నారు. వీరికి ఈ నెల 19 వరకు పరీక్ష నిర్వహించనున్నారు. ఉదయం షిఫ్ట్‌లో 3,280 మందికి 3,048 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం షిఫ్ట్‌లో 3,268 మందికి 3,056 మంది విద్యార్థులు హాజరైనట్లు జేఎన్‌టీయూ అధికారులు ప్రకటించారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కేంద్రాల వద్ద తగిన ఏర్పాట్లు చేశారు.

జూన్ నుంచి రేషన్ కార్డుదారులకు గోధుమలు

కిలో రూ.10కే సరఫరా చేయనున్న పౌరసరఫరాల శాఖ

సాక్షి, విశాఖపట్నం : నిరుపేదల ఆరోగ్యంపై దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా గోధుమలు సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేసింది. ఏపీ పౌరసరఫరాల కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలో జూన్ నుంచి రేషన్ కార్డుదారులకు గోధుమలు పంపిణీ చేయనున్నట్లు జేసీ విశ్వనాథన్ తెలిపారు. కిలో రూ.10 చొప్పున జిల్లాలోని 5,21,435 మంది బియ్యం కార్డుదారులకు ఒక్కొక్క కార్డుపై మూడు కేజీల వరకు గోధుమలు అందజేయనున్నట్లు వెల్లడించారు. బియ్యం, పంచదార మొదలైన రేషన్ సరకులతో పాటు గోధుమలు కూడా మొబైల్ రేషన్ వ్యాన్ల వద్ద అందుబాటులో ఉంటాయని తెలిపారు. రేషన్ దుకాణాల డీలర్లకు కిలోకి ఒక రూపాయి కమీషన్ అందిస్తున్నామని, అందరు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారి జి.సూర్యప్రకాష్ కోరారు.

ఏయూ బీటెక్ పరీక్ష ఫలితాల విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ చివరి సంవత్సరం చివరి సెమిస్టర్ పరీక్ష ఫలితాలను సోమవారం సాయంత్రం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి తన కార్యాలయంలో విడుదల చేశారు. రికార్డు సమయంలో కేవలం వారం రోజుల్లో ఫలితాలను అందించారు. రాష్ట్రంలో పరీక్షలు సకాలంలో నిర్వహించి, సత్వరం ఫలితాలను అందించిన తొలి విశ్వవిద్యాలయం ఏయూనే కావడం విశేషం. ఈ సంవత్సరం భారీగా ఏయూ విద్యార్థులు ఉపాధి అవకాశాలను సాధించారు. అదే విధంగా పెద్దసంఖ్యలో ఏయూ విద్యార్థులు విదేశీ విద్యను అభ్యసించడానికి వెళ్తున్నారు. వీరికి ఉపయుక్తంగా ఫలితాలను సకాలంలో విడుదల చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, డీన్‌లు ఆచార్య డి.వి.ఆర్ మూర్తి, ఆచార్య సి.హెచ్.వి.వి భాస్కర రెడ్డి పాల్గొన్నారు.

ఐసీడీటీ కోర్సుల బ్రోచర్ ఆవిష్కరణ

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నూతనంగా నెలకొల్పిన ఇన్నోవేషన్ సెంటర్ ఫర్ డ్రోన్ టెక్నాలజీస్(ఐసీడీటీ) బ్రోచర్‌ని, కేంద్రం నుంచి అందిస్తున్న కోర్సుల వివరాలతో కూడిన ప్రత్యేక సంచికను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి తన కార్యాలయంలో విడుదల చేశారు. డ్రోన్ టెక్నాలజీ రంగంలో సాంకేతిక, ఆవిష్కరణ, పరిశోధనల్లో పనిచేసే విధంగా విశ్వవిద్యాలయం, పరిశ్రమల సంయుక్త భాగస్వామ్యంలో ఈ కేంద్రం నెలకొల్పారు. కేంద్రం నుంచి అందించే కోర్సుల వివరాలను ఈ సందర్భంగా విడుదల చేశారు. కార్యక్రమంలో కేంద్రం సీఈఓ ఎస్.కె.వి.సతీష్, ప్రాజెక్ట్ హెడ్ గిరిబాబు, సత్యనారాయణన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఓ.ఆర్.ఎం.రావు, బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్ రేష్మ, సమన్వయకర్త హేమ తదితరులు పాల్గొన్నారు.

రూట్ మార్చిన మేయర్

- చలివేంద్రంలో నీటి శుభ్రత పరిశీలన
- ప్లాస్టిక్ కవర్లు వాడొద్దంటూ చిరువ్యాపారులకు సూచన
- బస్సులో వచ్చి.. విద్యుత్ వాహనంలో వెళ్లిన వైనం



చలివేంద్రంలో నీరు తాగుతున్న మేయర్



ప్లాస్టిక్ వాడకంపై టిఫిన్ దుకాణదారులను హెచ్చరిస్తున్న మేయర్

డాబాగార్డెన్స్: నగర మేయర్ గొలగాని హరివెంకట కుమారి సోమవారం రూట్ మార్చారు. ఆమె కొన్నాళ్లగా క్యాంపు కార్యాలయం నుంచి నేరుగా ప్రజారవాణా ద్వారా జీవీఎంసీకి వెళ్తున్న సంగతి తెలిసిందే. ఈ సోమవారం తన పంథా మార్చారు. క్యాంపు కార్యాలయం నుంచి ముందుగా ఆర్టీసీ బస్సులో జీవీఎంసీకి బయలుదేరారు. చిరువ్యాపారులు ప్లాస్టిక్ కవర్లు ఉపయోగిస్తుండడాన్ని గుర్తించారు. వారితో మాట్లాడి ప్లాస్టిక్‌ను నిషేధించామని, హానికరమైన కవర్లు వాడితే చర్యలు తప్పవని చెబుతూనే.. క్లాత్, నార సంచుల వాడకాన్ని పెంచాలని సూచించారు. అలాగే జీవీఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలి వేంద్రాలను పరిశీలించారు. సిబ్బంది ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉండాల్సిందేనని, ఎండ వేడిమి నుంచి ఉపశమనం కల్గించేలా బాటసారులకు మంచినీళ్లు అందజేయాలని ఆదేశించారు. చలివేంద్రంలో నీరు తాగారు. ప్రజల సమస్యల పరిష్కారానికి 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం ప్రవేశపెట్టినట్టు తెలిపారు. అనంతరం జీవీఎంసీలో నిర్వహించే స్పందనలో కమిషనర్ సాయికాంత్ వర్మతో కలిసి పాల్గొన్నారు. స్పందన పూర్తయిన తర్వాత విద్యుత్ వాహనంలో క్యాంపు కార్యాలయానికి వెళ్లారు.

గృహస్థాశ్రమ ధర్మం పాటించాల్సిందే ..

బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు





అధ్యాత్మిక ప్రసంగం చేస్తున్న బ్రహ్మశ్రీ చాగంటి కోటీశ్వరరావు, హాజరైన ప్రముఖులు

మహారాణిపేట: గృహస్థాశ్రమ వైభవం ఎంతో విశేషమైనదని, గృహస్థాశ్రమంలో ఉండే వారు ధర్మాలను పాటించాల్సిందేనని బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. గురజాడ కళాక్షేత్రంలో సోమవారం ధర్మవర్ధిని ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గృహ స్థాశ్రమ వైభవం అనే అంశంపై బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలు చేశారు. గృహస్థాశ్రమంలో ఉన్న వారు నియమాలు, కట్టుబాట్లు, ఆచార వ్యవహారాలు, ధర్మాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. మానవ జన్మ పొందిన ప్రతి ఒక్కరూ పితృరుణం,మాతృ రుణం, రుషిరుణం, దైవరుణం తప్పనిసరిగా తీర్చుకోవాలని హితవు పలికారు. గృహస్థాశ్రమంలో పెద్దవాళ్ల దగ్గర నుంచి పిల్లల వరకు కుటుంబ సభ్యులందరూ అరమరికలు లేకుండా జీవించగలిగినప్పుడే పరిపూర్ణమైన ఆనందాన్ని పొందగలుగుతారని తెలిపారు. గృహస్థాశ్రమంలో భార్యకు పవిత్రమైన స్థానం ఉందన్నారు. వివాహమంటే సంసారం కోసం కాదని భార్యాభర్తల అన్యోన్యతకు, ఆదర్శానికి చిహ్నమని తెలిపారు. భార్య భర్త కలసి సనాతన సంప్రదాయాలను అనుసరిస్తూ ఇంట్లో పెద్దవాళ్ల ఆశీసులు పొందుతూ జీవించాలన్నారు. కార్యక్రమంలో బ్రహ్మశ్రీ కోటేశ్వరరావు ధర్మపత్ని సుబ్రహ్మణ్యేశ్వరి, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, అన్నంరాజు రమాదేవి నారాయణ దంపతులు, ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, ధర్మ వర్ధిని ట్రస్టు సభ్యులు చాగంటి చరణ్, చాగంటి సత్సంగ, సభ్యులు పాల్గొన్నారు.

పోలీస్ స్పందనకు 50 ఫిర్యాదులు



ఫిర్యాదుదారుల సమస్యలు తెలుసుకుంటున్న సీపీ త్రివిక్రమ్ వర్మ

దొండపర్తి (విశాఖ దక్షిణ): స్పందనలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్‌వర్మ పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం పోలీస్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 50 ఫిర్యాదులు వచ్చాయి. సీపీ స్వయంగా ఫిర్యాదులు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిపై సంబంధిత అధికారులతో మాట్లాడి సత్వరమే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీపీ(క్రైం) జి.నాగన్న, ఏడీసీపీ(ఎస్‌బీ) డి.గంగాధరం పాటు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏసీపీలు, అన్ని పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

డయల్ యువర్ సీపీకి 17 ..

దొండపర్తి (విశాఖ దక్షిణ): డయల్ యువర్ సీపీ కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ పోలీస్ అధికారులను ఆదేశించారు. ప్రతి నెల 1, 15 తేదీల్లో నిర్వహిస్తున్న డయల్ యువర్ సీపీ కార్యక్రమానికి సోమవారం 17 మంది కాలర్స్ ఫోన్ చేసి సీపీకి ఫిర్యాదులు చేశారు. సీపీ త్రివిక్రమ్ వర్మ ప్రతి ఒక్క కాలర్‌తో మాట్లాడుతూ వారి సమస్యలను తెలుసుకుంటూ సంబంధిత అధికారులతో తక్షణమే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. వెంటనే ఆ ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాలర్స్ ఇచ్చిన ఫిర్యాదుల్లో భూ వివాదాలు, భార్యభర్తల గొడవలు, సివిల్ కేసులు, వ్యాపారం కోసం నదు ఇచ్చి మోసపోయిన వారు, నగర ట్రాఫిక్ సమస్యలకు సంబంధించినవి ఉన్నాయి. ప్రజలు తమ సమస్యలపై డయల్ యువర్ సీపీ కార్యక్రమం ద్వారా స్వయంగా ఫిర్యాదు చేయాలంటే 0891–2523408 నంబర్‌కు కాల్ చేయాలని సీపీ త్రివిక్రమ్ వర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీపీ–1 విద్యాసాగర్ నాయుడు, , డీసీపీ–2 కె.ఆనందరెడ్డి, ఏడీసీపీ(ఎస్‌బీ) డి.గంగాధరం తదితరులు పాల్గొన్నారు.

అర్జీలపై జేసీ సమీక్ష



అర్జీలను స్వీకరిస్తున్న జేసీ విశ్వనాథన్

మహారాణిపేట: జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను నిర్ణీత కాలపరిమితిలోగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ కె.యస్ విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో జగనన్నకు చెబుదాం దరఖాస్తుల పరిష్కారంపై అధికారులతో జేసీ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న అర్జీలను వెంటనే పరిష్కరించాలన్నారు. సోమవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో 138 అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో డీఆర్‌వో ఎస్.శ్రీనివాసమూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ వర్మ, పోలీస్ అధికారులు, మున్సిపల్ అధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తప్పుడు నివేదిక ఇస్తే చర్యలు

- అర్జీదారులతో నేరుగా మాట్లాడుతున్నా
- అధికారులు తేడా చేస్తే ఉపేక్షించం
- స్పందనలో మేయర్ హరివెంకట కుమారి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న మేయర్ హరివెంకట కుమారి, కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్ : స్పందనకు వచ్చిన అర్జీల రిపోర్టు తన వద్ద ఉంది. సమస్యలు పరిష్కరించకుండా తప్పుడు నివేదిక ఇస్తే చర్యలు తప్పవని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అధికారులను హెచ్చరించారు. స్పందన అర్జీదారులతో నేరుగా మాట్లాడుతున్నానని ఏ మాత్రం అధికారులు తేడా చేసినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. స్పందన కార్యక్రమాన్ని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మతో కలిసి సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వచ్చిన ఫిర్యాదులు నిర్ణీత సమయంలో పరిష్కరించాలన్నారు. స్పందన కార్యక్రమానికి కొంత మంది అధికారులు డుమ్మాకొట్టిన నేపథ్యంలో వారి నుంచి వివరణ తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కమిషనర్ సాయికాంత్ వర్మ మాట్లాడుతూ వచ్చిన ఫిర్యాదులు 3 రోజుల్లో పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

83 వినతులు : జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందనలో 83 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో జోన్–2కు 11, జోన్–3కి 10, జోన్–4కి ఆరు, జోన్–5కి ఐదు, జోన్–6కి 13, జోన్–8కి నాలుగు, జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి 34 ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో అదనపు కమిషనర్లు, డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, ప్రధాన సిటీ ప్లానర్ సురేష్‌కుమార్, జేడీ (అమృత) విజయభారతి, డీసీ (రెవెన్యూ) ఫణిరాం, సెక్రటరీ పి.నల్లనయ్య, ఎఫ్ఏ అండ్ ఏవో మల్లికాంబ, డీడీ(హార్టీకల్చర్) దామోదరరావు, పర్యవేక్షక ఇంజినీర్లు కేపీఎస్ రవి, వినయ్‌కుమార్, వేణుగోపాలరావు, కృష్ణారావు, గోవిందరావు, రామ్మోహనరావు, డీపీవో చక్రధర్, డీఈవో శ్రీనివాసరావు, రీజినల్ ఫైర్ ఆఫీసర్ సీహెచ్ కృపావాసం, డీసీపీలు, ఏసీపీలు, యూసీడీ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముగ్గురి అరెస్ట్

మత్తు ఇంజక్షన్లు, గంజాయి, సెల్‌ఫోన్లు స్వాధీనం

అల్లిపురం: ఇటీవల మత్తు ఇంజక్షన్లు కలిగివున్న ముగ్గురు వ్యక్తులను టూటౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే. విచారణ అనంతరం వారిని సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ బి.తిరుమల రావు తెలిపారు. భీమిలి, రెల్లివీధికి చెందిన కొల్లి హరిపద్మ రాఘవరెడ్డి, అల్లిపురం నేరెళ్లకోనేరు ప్రాంతానికి చెందిన పప్పాల రవి, మర్రిపాలెం, రైల్వే క్వార్టర్స్‌కు చెందిన పాకా చిరంజీవిలు పశ్చిమ బెంగాల్‌లో నిషేధిత మత్తు ఇంజక్షన్లు (ఫోర్టివిన్) తక్కువ ధరకు కొనుగోలు చేసి నగరంలో యువతకు అధిక ధరకు అమ్ముతున్నారని సమాచారం మేరకు టాస్క్‌ఫోర్సు పోలీసులు దాడులు నిర్వహించారు. వారి వద్ద నుంచి 2100 ఫోర్టువిన్ ఇంజక్షన్లు, 21 కేజీల గంజాయి, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

నగరంలో నేడు

- ఉదయం 9 గంటలకు అగనంపూడి ఫార్మసిటి కాలనీ హైస్కూలు గ్రౌండ్ ఆవరణలో ఫార్మసిటీ భూ నిర్వాసితుల కుటుంబ సభ్యులకు ఇళ్ల పట్టాల పంపిణీ. ముఖ్యఅతిథిగా హాజరుకానున్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కోర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి
- ఉదయం 10 గంటలకు పోర్టు వాణి ఆడిటోరియంలో రోజ్గార్ మేళా
- 11 గంటలకు సిరిపురం చిల్డ్రన్స్ ఎరీనాలో జీవీఎంసీ మున్సిపల్ పాఠశాల్లో పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు సన్మానం
- 11.30 గంటలకు హోటల్ దస్పల్లాలో స్టేట్ లెవల్ బ్యాంకర్ల కమిటీ సమావేశం

అన్నవరం.. అద్భుతం

- కీలక పర్యాటక ప్రాజెక్టులకు స్వర్గధామంగా అన్నవరం తీరం
- ఒబెరాయ్, తాజ్ గ్రూప్స్ స్టార్ విల్లాలు, రిసార్టులు, హోటల్స్
- రూ.100 కోట్లతో స్కైటవర్ ఏర్పాటుకు ప్రభుత్వంతో స్విట్జర్లాండ్ సంస్థ ఎంవోయూ
- రూ.250 కోట్లతో ఐ ఆన్ వీల్స్ ఏర్పాటు చేయనున్న రష్యాకు చెందిన పాక్స్ సంస్థ
- భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లేదారిలో అద్భుతాలు

సాక్షి, విశాఖపట్నం : ఒకవైపు సాగర సోయగాలు.. మరోవైపు ఎత్తయిన తూర్పు కనుమల అందాలు ప్రపంచ పర్యాటకులను కట్టిపడేస్తుండగా.. ప్రపంచ పర్యాటక పటంలో టూరిజం రాజధానిగా భాసిల్లే విధంగా ప్రాజెక్టులు వస్తున్నాయి. దేశీ, విదేశీ పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తున్న విశాఖలో ఉన్న టూరిజం స్థలాలను వినియోగంలోకి తీసుకురావాలని నిర్ణయించింది.

విదేశీ పర్యాటకులు విశాఖను సందర్శించేందుకు మొగ్గు చూపుతున్న నేపథ్యంలో వైజాగ్‌లో అంతర్జాతీయ సౌకర్యాలతో కూడిన టూరిజం ప్రాజెక్టులకు అడుగులు పడుతున్నాయి. కేవలం విశాఖ నగరంలోనే కాకుండా శివారు ప్రాంతాల్లోనూ పర్యాటకం పరుగులు పెట్టాలన్న సీఎం వైఎస్ జగన్ మార్గదర్శకాలకు అనుగుణంగా సరికొత్త టూరిజం డెస్టినీగా జిల్లాకు సరిహద్దు గ్రామంగా ఉన్న అన్నవరం ప్రాంతం అవతరిస్తోంది.

భవిష్యత్తులో రాబోతున్న అంతర్జాతీయ టూరిజం ప్రాజెక్టులకు ప్రధాన కేంద్రంగా భీమిలి సమీపంలోని అన్నవరం ప్రాంతం కాబోతోంది. సాహస పర్యాటకానికి, సరికొత్త రిసార్టులకు, స్టార్ హోటల్స్‌కు ఈ గ్రామం అనువుగా ఉందంటూ దేశ విదేశీ పెట్టుబడుదారులు మొగ్గు చూపుతున్న నేపథ్యంలో విశాఖ పర్యాటకంలో అన్నవరం నూతన అధ్యాయాన్ని లిఖించనుంది. ఇప్పటికే పలు కీలక సంస్థలకు టూరిజం శాఖ ఈ ప్రాంతంలో భూములను కేటాయించింది. త్వరలోనే మరిన్ని ప్రాజెక్టులకు స్థలాలను అందించేందుకు కసరత్తులు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది మార్చిలో విశాఖ నగరంలో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టిమెంట్ సమ్మిట్ (జీఐఎస్)–2023లో టూరిజం విభాగంలో కీలక ఎంవోయూలు చేసుకున్న దేశీయ, అంతర్జాతీయ సంస్థలు.. తమ పర్యాటక ప్రాజెక్టులను అన్నవరం పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని నిర్ణయించాయి. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా ప్రభుత్వం పర్యాటక శాఖ అధికారుల బృందంతో అన్నవరం పరిసరాల్లో భూ కేటాయింపులపై దృష్టిసారించాలని సూచించారు. దానికనుగుణంగా ఈ గ్రామ సాగర తీర పరిసరాలు భవిష్యత్తులో విభిన్నతను సంతరించుకోనున్నాయి.

భోగాపురం ఎయిర్‌పోర్టుకు సమీపంలో..

ఇటీవలే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా విశాఖ నగరం నుంచి భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్ పోర్టును అనుసంధానం చేయాలనే లక్ష్యంతో భీమిలి టూ భోగాపురం ఆరులైన్ల హైవే నిర్మాణానికి కూడా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ రహదారి నిర్మాణానికి సంబంధించిన డీపీఆర్ తయారీకి కేంద్రం నుంచి అనుమతులు కూడా మంజూర య్యాయి. ఈ నేపథ్యంలో ఈ రహదారి సమీపంలో ఉన్న ప్రాంతమంతా అభివృద్ధికి కేంద్ర బిందువుగా మారనుంది. ఇదే వరుసలో ఉన్న అన్నవరం అన్నింటికీ అనుకూలమైన ప్రాంతంగా ఉండటం.. భోగాపురం ఎయిర్ పోర్టుకు సుమారు 3 కిమీ దూరంలోనే ఉండటంతో అందరి దృష్టి ఇక్కడే ఉంది. అందుకే వరుస ప్రాజెక్టులు ఇక్కడ మొదలుకానున్నాయి.

ఒబెరాయ్ విల్లాలు.. తాజ్ రిసార్టులు

అన్నవరం ప్రాంతంలో టూరిజం శాఖకు సంబంధించి 80 ఎకరాల భూములున్నాయి. ఈ ప్రాంతంలో పర్యాటక హోటల్స్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తుండగా హోటల్స్ రంగంలో దిగ్గజమైన ఒబెరాయ్, తాజ్ హోటల్స్ విశాఖలో తన వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించాలని నిర్ణయించాయి. సుమారు రూ.300 కోట్లతో 300 మందికి ఉపాధి కల్పించేలా అన్నవరం సమీపంలో ఒబెరాయ్ హోటల్‌ను నిర్మించనుంది. ఇందుకోసం ఇప్పటికే ఒబెరాయ్‌కు అన్నవరంలో 40 ఎకరాలు కేటాయించారు. అదేవిధంగా తాజ్ కూడా అన్నవరంలోనే సుమారు రూ.700 కోట్లతో లగ్జరీ రిసార్టులు, స్టార్ హోటల్ నిర్మించేందుకు ముందుకు వచ్చింది. ఈ గ్రూప్‌నకు 30 ఎకరాలు కేటాయించేందుకు కసరత్తులు జరుగుతున్నాయి. ఈ రెండు హోటల్స్ ఏర్పాటైతే ఈ ప్రాంతం దశ దిశ మారనుంది. మరోవైపు జల విహార్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ రూ.250 కోట్లతో 500 మందికి ఉపాధి కల్పిస్తూ అన్నవరం ప్రాంతంలో జలవిహార్ టూరిజం హార్బర్ నిర్మించేందుకు ప్రభుత్వంతో ఎంవోయూ కుదుర్చుకుంది.



అన్నవరం తీరం



ఒబెరాయ్ హోటల్

స్కైటవర్.. ఐ ఆన్ వైజాగ్..

అదేవిధంగా.. అన్నవరం సమీపంలోనే మరికొన్ని విభిన్న టూరిజం ప్రాజెక్టులు రానున్నాయి. రూ.100 కోట్లతో 50 మందికి ఉపాధి అందించేలా స్విట్జర్లాండ్‌కు చెందిన అకౌంటిపై అంతర్జాతీయ సంస్థ యూఎస్‌కు చెందిన ఎస్ఆర్ఐ సంస్థ భాగస్వామ్యంతో స్కైటవర్‌ను ఏర్పాటు చేయనుంది. దీంతో పాటు ఇదే ప్రాంతంలో భారీ జెయింట్ వీల్ కూడా రాబోతోంది. ఐ ఆన్ వీల్స్ వైజాగ్ పేరుతో రష్యాకు చెందిన పాక్స్ సంస్థ రూ.250 కోట్లతో దీన్ని ఏర్పాటు చేయనుంది. ఈ రెండు భారీ ప్రాజెక్టులకు సంబంధించిన ఎంవోయూలు జీఐఎస్ సదస్సులో జరిగాయి. వీటికి భూ కేటాయింపులపై ఇటీవలే పర్యాటక శాఖ అధికారులు ఆయా సంస్థల ప్రతినిధులతో సమావేశమై చర్చలు జరిపారు. ప్రాజెక్టుల డీపీఆర్ రాగానే.. భూ కేటాయింపుల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఇంకా మరికొన్ని ఆహ్లాదకరమైన.. సాహసక్రీడలకు సంబంధించిన టూరిజం ప్రాజెక్టులతో అన్నవరం భాసిల్లనుంది.

ఆర్‌కే బీచ్ నుంచి అన్నవరం తీరం వరకూ..



జిల్లాలో ఉన్న తీరప్రాంతమంతా టూరిస్టులతో కళకళలాడాలని అంతర్జాతీయ పర్యాటకులను కూడా ఆకట్టుకోవాలన్నది సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కాన్సెప్ట్. దానికనుగుణంగా సరికొత్త పర్యాటకాన్ని విశాఖ వచ్చే టూరిస్టులకు పరిచయం చేసేందుకు ప్రభుత్వం విభిన్నమైన ఒప్పందాలు చేసుకుంది. శివారు ప్రాంతమైన అన్నవరం వరకూ సాగరతీరం సందడిగా మారనుంది. ముఖ్యంగా అన్నవరం బీచ్ పరిసరాలకు భవిష్యత్తులో మహర్దశ రానుంది. ఇప్పటికే అన్నవరంలో దిగ్గజ సంస్థ ఒబెరాయ్‌కు స్థల కేటాయింపు జరిగింది. మిగిలిన ప్రాజెక్టులకు కూడా వాటి డీపీఆర్‌ల ప్రకారం భూములు అందించేందుకు కసరత్తు ప్రారంభించాం. పెట్టుబడుల సదస్సులో కుదుర్చుకున్న ఎంవోయూలు గ్రౌండ్ అయ్యేలా ప్రభుత్వం పకడ్బందీగా వ్యవహరిస్తోంది. ప్రతి పర్యాటక స్థలంలోనూ ఒక విభిన్న ప్రాజెక్టు వచ్చి దేశ విదేశీ సందర్శకులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలన్న ఆలోచనలు త్వరలోనే అమలుకు ప్రయత్నిస్తున్నాం.

– శ్రీనివాస్ పాణి, పర్యాటక శాఖ రీజనల్ డైరెక్టర్

యూఎల్‌సీ జీవోపై అవగాహన



మాట్లాడుతున్న జేసీ విశ్వనాథన్

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 43వ వార్డు వేంకటేశ్వర కాలనీలో జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్ ఆధ్వర్యంలో అర్బన్ ల్యాండ్ సీలింగ్, జీవో నం 84పై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 84 గురించి స్థానికులకు జేసీ వివరించారు. ఈ ప్రాంతంలో 0–150గజాలలోపు నివసిస్తున్న వారికి ఉచితంగా డి.పట్టాలు ఇవ్వనున్నారు. పదేళ్ల వరకు ఈ గృహాలను విక్రయించకూడదు. ఆ తరువాత రెగ్యులరైజ్ చేయనున్నట్టు తెలిపారు. అలాగే 151 గజాల నుంచి 300గజాల వరకు గల గృహాలలో నివసిస్తున్న బేసిక్ మార్కెట్ వాల్యూపై 15శాతం, 301 గజాల నుంచి 500గజాలలోపు వారికి వారికి 30శాతం, 500 గజాల పై వారికి పూర్తి వేల్యూ చెల్లిస్తే వెంటనే వారి పేర్లు మీద రిజిస్ట్రేషన్ చేస్తామన్నారు. కార్యక్రమంలో భీమిలి ఆర్డీవో భాస్కర్‌రెడ్డి, సీతమ్మధార రెవెన్యూ అధికారి పేర్లి శ్యాంప్రసాద్, హెచ్‌డీటీ చేతన్‌కుమార్, ఆర్ఐ రవి కృష్ణ, గ్రేడ్–1, గ్రేడ్–2 వీఆర్‌వోలు పాల్గొన్నారు.

ముగిసిన టీటీ లీగ్

విశాఖ స్పోర్ట్స్: ప్రీమియర్ లీగ్ టెబుల్‌టెన్నిస్ టోర్నీలో ఎస్ఎంఎస్ డెంటల్ జట్టు 32 పాయింట్లతో విజేతగా నిలిచింది. కేవలం ఒక్క పాయింట్ వెనుకబడి ఓఎస్ఎల్ గ్రూప్ ద్వితీయ స్థానంతో సరిపుచ్చింది. వీఎస్ఐఎల్ గ్రూప్ 29 పాయింట్లతో తృతీయ స్థానంలో నిలిచింది. పోటీల్లో విజేతలకు రూ.4లక్షల నగదు ప్రోత్సాహకాల్ని పంచారు. విజేతలకు జ్ఞాపికలు అందచేశారు.

పకడ్బందీగా పాలిటెక్నిక్ పరీక్షలు

టెక్నికల్ ఎడ్యుకేషన్ సంయుక్త కార్యదర్శి సత్యనారాయణమూర్తి

మురళీనగర్(విశాఖ ఉత్తర): రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కాలేజీల్లో విద్యార్థులకు వార్షిక పరీక్షలు పకడ్బందీగా జరుగుతున్నాయని రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ సంయుక్త కార్యదర్శి (అకడమిక్) జీవీవీ సత్యనారాయణ మూర్తి చెప్పారు. పాలిటెక్నిక్ విద్యార్థులకు వార్షిక పరీక్షలు ఈనెల 12వ తేదీ నుంచి జరుగుతున్నాయి. సీ–20 సిలబస్‌కు సంబంధించి ఫస్టియర్ వార్షిక పరీక్షలతోపాటు సెకండియర్ థర్డ్ సెమిస్టర్ సప్లిమెంటరీ, ఫోర్త్ సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నారు. నగరంలోని ఆల్వార్‌దాస్ పాలిటెక్నిక్ కాలేజీ, పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ, కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ, చైతన్య పాలిటెక్నిక్ కాలేజీ పరీక్ష కేంద్రాలను సోమవారం ఆయన సందర్శించారు. కేంద్రాల్లో సీటింగ్ ఏర్పాట్లు, మంచినీటి సౌకర్యాలు, ప్రయోగశాలల్లో ఏర్పాట్లు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో సోమవారం 584 మందికి 569మంది హాజరవడంతో 97శాతం హాజరు నమోదైంది. కెమికల్ ఇంజినీరింగు కాలేజీలో 240 మందికి 239 మంది పరీక్షలకు హాజరు కావడంతో 99.5శాతం నమోదైంది.



పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన సత్యనారాయణమూర్తి

రిసోర్స్ పర్సన్‌తో డ్రైవర్ అసభ్య ప్రవర్తన

జోనల్ కార్యాలయం వద్ద ఆర్‌పీల ఆందోళన

భీమునిపట్నం: భీమిలి పరిధిలోని మహిళ సంఘాలకు చెందిన ఒక రిసోర్స్ పర్సన్ (ఆర్పీ)పై అసభ్యకరంగా, అనుచితంగా ప్రవర్తించిన డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని ఆర్పీలు సోమవారం జోనల్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. మహిళ సంఘాల్లో సభ్యులుగా ఉన్నవారు గ్రూపు సభ్యుల నుంచి చెత్త పన్ను వసూలు చేస్తారు. ఇదే క్రమంలో మామిడిపాలెంలోని ఓ మహిళా సంఘ సభ్యురాలి ఇంటికి వెళ్లిన ఆర్పీకి చేదు అనుభవం ఎదురైంది. మహిళ సంఘ సభ్యురాలి భర్త త్రినాథ్ జోన్ పరిధిలో చెత్త సేకరించే క్లాప్ వాహనం డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. చెత్త పన్ను కట్టాలని ఆర్పీ అడగగా పన్ను చెల్లించేది లేదు..ఎవరితో చెప్పుకుంటావో చెప్పుకో..అంటూ దుర్భాషలాడాడు. ఒంటిపై ఉన్న దుస్తులను విప్పి అసభ్యకరంగా, అనుచితంగా ప్రవర్తించాడు. దీనిపై ఆమె ఇతర ఆర్పీల మద్దతుతో ఆందోళన నిర్వహించారు. దీనిపై స్పందించిన జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము ఆందోళనకారులతో మాట్లాడారు. త్రినాథ్‌ను వెంటనే విధుల నుంచి తప్పిస్తున్నామని, అలాగే లిఖిత పూర్వకంగా క్షమాపణ పత్రం తీసుకుంటామని జెడ్సీ చెప్పడంతో ఆందోళన విరమించారు.



ఆర్పీలతో మాట్లాడుతున్న జెడ్సీ రాము

ఎలా చదువుతున్నారు...

విద్యార్థుల ఇళ్లకు వెళ్లిన డీఈవో



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

విశాఖ విద్య: పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు విద్యార్థులు ఎలా సిద్ధమవుతున్నారనేది తెలుసుకునేందుకు డీఈవో ఎల్.చంద్రకళ నేరుగా ఇళ్లకు వెళ్లారు. గాజువాక జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి అభ్యసించిన వారి ఇళ్లకు సోమవారం రాత్రి వెళ్లి విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రణాళికాబద్ధంగా చదివితే అడ్వాన్స్ పరీక్షల్లో తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధించవచ్చన్నారు. రక్తహీనత లోపం ఉన్న విద్యార్థులకు ఐరెన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు ఇస్తున్నందున, వాటిని సక్రమంగా వేసుకునేలా తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుడి మృతి



మృతుడు శంకర్ దాస్

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీలో ఠాగూర్ పరిశ్రమలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుడు అనారోగ్యంతో మృతి చెందాడని పరవాడ సీఐ పి.ఈశ్వరరావు చెప్పారు. మృతుడు బీహార్‌కు చెందిన శంకర్‌దాస్ (50)గా గుర్తించారు. సీఐ అందించిన వివరాల ప్రకారం ఠాగూర్ పరిశ్రమలో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్న శంకర్‌దాస్ సోమవారం ఉదయం 6 గంటలకు విధులకు వచ్చి బ్రాయిలర్ వద్ద బొగ్గు, కలప అందిస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వెంటనే కేజీహెచ్‌కు తరలించి చికిత్స అందిస్తుండగా మధ్యాహ్నం మృతి చెందాడని సీఐ చెప్పారు. పరిశ్రమ యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. ఇదిలావుండగా మృతి చెందిన శంకర్‌దాస్ కుటుంబానికి నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు.

పూలు గుసగుసలాడేనని..



ముడసర్లోవ పార్కులో కాగితం పువ్వులు విశేషంగా ఆకర్షిస్తున్నాయి. చెట్టంతా పువ్వులు ఉండటంతో ఇది 'పుష్ప గుచ్ఛం'లా తలపిస్తోంది. దీంతో అందంగా ఉన్న ఈ పూల చెట్టు వద్ద సందర్శకులు ఫొటోలు దిగుతున్నారు.

-ఆరిలోవ

పలు రైళ్లు రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం : ఆయా స్టేషన్లకు చేరుకోవాల్సిన పలు రైళ్లు ఆలస్యంగా చేరుకుంటున్నందున ఆయా స్టేషన్లలో బయల్దేరుతున్న పలు రైళ్లు రీషెడ్యూల్ చేసినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఆయా స్టేషన్లలో బయల్దేరిన సమయాన్ని బట్టి ఈ రైళ్లు అంతే ఆలస్యంగా ఇతర స్టేషన్లకు చేరుకోనున్నాయి.

- బెంగళూరులో మే 15న ఉదయం 10.35 గంటలకు బయల్దేరాల్సిన ఎం.విశ్వేశ్వరయ్య టెర్మినల్ బెంగళూరు – హౌరా (12864) ఎక్స్‌ప్రెస్ సుమారు మూడు గంటలు ఆలస్యంగా మధ్యహ్నం 1.30 గంటలకు బయల్దేరింది.
- హౌరాలో మే 15న ఉదయం 9.20 గంటలకు బయల్దేరాల్సిన హౌరా – ఎం.విశ్వేశ్వరయ్య టెర్మినల్ (బెంగళూరు) (12863) సుమారు రెండున్నర గంటలు ఆలస్యంగా 11.50 గంటలకు బయల్దేరింది.
- విశాఖపట్నంలో మే 15న రాత్రి 7.10 గంటలకు బయల్దేరాల్సిన విశాఖపట్నం – తిరుపతి (08583) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ మధ్య రాత్రి 12.30 గంటలకు బయల్దేరింది
- టాటానగర్‌లో మే 15న ఉదయం 7.20 గంటలకు బయల్దేరాల్సిన టాటానగర్ – విశాఖపట్నం (20815) ఎక్స్‌ప్రెస్ రెండు గంటలు ఆలస్యంగా ఉదయం 9.20 గంటలకు బయల్దేరింది
- పురూలియాలో మే 15న ఉదయం 10 గంటలకు బయల్దేరాల్సిన పురూలియా – విల్లుపురం (22605) ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 12.05 గంటలకు బయల్దేరింది.









'ఉక్క'రిబిక్కిరి

సూరీడు నిప్పులుకక్కుతున్నాడు. సోమవారం మరింత మండిపోయాడు. దీంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. వృద్ధులు, చిన్నారులు అల్లాడిపోయారు. వివిధ పనులపై బయటకు వచ్చినవాళ్లంతా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తీవ్ర వడగాడ్పులతో ఆపసోపాలు పడ్డారు. కొందరు చెట్ల నీడలో..మరికొందరు శీతల పానీయాలు తాగుతూ సేదతీరారు.



ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం